పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్‌ పత్రాలు



మంజూరైన పెన్షన్‌ పత్రాలను అందజేసిన కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌

పటాన్‌చెరు టౌన్‌: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్‌ ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం, పదవీ విరమణ సాఫీగా జరిగేలా చేయడమే లక్ష్యం అని ప్రాంతీయ ప్రావిడెంట్‌ ఫండ్‌ కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ అన్నారు. గురువారం పదవీ విరమణ పొందిన 15 మందికి పెన్షన్‌ చెల్లింపు ఆర్డర్‌ కాపీలను పటాన్‌చెరు మండలం పాశమైలారం అరబిందో ఫార్మాలో నిర్వహించిన నిధి ఆప్‌ కే నిఖత్‌ కార్యక్రమంలో అందచేశారు. కార్యక్రమంలో పీఎఫ్‌ కమిషనర్‌–2 శ్రీమతి శ్రీదేవి, అసిస్టెంట్‌ కమిషనర్‌ రామకృష్ణ, అకౌంట్స్‌ ఆఫీసర్‌ అబ్దుల్‌ అజీమ్‌, అరబిందో ఫార్మా హెచ్‌ఆర్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్యశిబిరం

నిజాంపేట్‌ : ప్రగతినగర్‌, సుందరయ్య భవనం, మిథిలానగర్‌ కమాన్‌ వద్ద మార్చి 2వ తేదీ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు బీపీ, షుగర్‌ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పిక్సల్‌ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9348581024 / 9247490627 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

హెచ్‌సీయూ ఎంఎంటీటీసీ ఇన్‌చార్జ్‌ డైరెక్టర్‌గా ప్రొ.వెంకటరమణ



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలోని మాలవ్య మిషన్‌ టీచర్‌ ట్రెనింగ్‌ సెంటర్‌ (ఎంఎంటీటీసీ) ఇన్‌చార్జీ డైరెక్టర్‌గా సీనియర్‌ ప్రొఫెసర్‌ వి వెంకటరమణ నియమితులయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఎంఎంటీటీసీ ద్వారా ఉపాధ్యాయులు/ అధ్యాపకుల సామర్థ్యాన్ని శిక్షణ ద్వారా పెంపొందించడానికి పనిచేస్తుంది. బోధన, పరిశోధన, ప్రచురణలు, పేటెంట్లు, సంస్థాగత అభివృద్ధిలో భారతీయ విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ మిషన్‌ పని చేస్తుంది.

విద్యార్థులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హోప్‌ చేయూత

చందానగర్‌ : విద్యార్థులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హోప్‌ చేయూత అందించింది. చందానగర్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు స్థానిక పాఠశాలలో చదువుతున్నారు. ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు కొండ విజయ్‌కుమార్‌ గురువారం వీరికి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మధుసూదనరెడ్డి, శాంతిభూషణ్‌ రెడ్డి, మారం ప్రసాద్‌, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌ను కలిసిన న్యూ ప్రశాంత్‌నగర్‌ కాలనీవాసులు

మియాపూర్‌: కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ అన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని న్యూ ప్రశాంత్‌నగర్‌ కాలనీ, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు గురువారం కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ను కలిసి కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు.అనంతరం కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌, అసోసియేషన్‌ సభ్యులు రవీందర్‌రెడ్డి, రంగారావు, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విక్రమ్‌, లక్ష్మణ్‌ తదితరులున్నారు.

అన్నదానం

శేరిలింగంపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగండ్లలోని సోమేశ్వరాలయంలో అన్నసమారాధన చేశారు. గురువారం ఆలయంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నాయకులు చెన్నంరాజు, భిక్షపతి, యాదగిరి, నారాయణ, నరేష్‌సింగ్‌, విజయందర్‌రెడ్డి, గిరి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

మురుగులోనే రాకపోకలు



గంగారం పీజేఆర్‌ రోడ్డులో ప్రధాన కూడలి వద్ద పొంగుతున్న మ్యాన్‌హోల్‌

నెలల తరబడి రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ

- నూతన అండర్‌ గ్రౌండ్‌ పైప్‌లైన్‌ ఏర్పాటుకు రూ.70 లక్షలు మంజూరు
- శంకుస్థాపన చేసినా ప్రారంభం కాని పనులు



చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌లో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. నెలల తరబడి మురుగు సమస్యతో నడవాలంటే స్థానికులు, రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీరు పక్కనే ఉన్న గంగారం చెరువులోకి చేరుతున్నాయి. మాధవపురి హిల్స్‌, కెఎస్‌ఆర్‌ లేఅవుట్‌ తదితర కాలనీల డ్రైనేజీ పైప్‌లైన్‌లో చెత్త చెదారం పేరుకుపోవడంతో మ్యాన్‌హోళ్లు పొంగి రోడ్డుపై మురుగు పారుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పక్కనే ఉన్న దేవాలయాలకు వెళ్ళే భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పైప్‌లైన్‌ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే గాంధీ నూతన అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పైప్‌లైన్‌కు రూ.70 లక్షల నిధులు మంజూరు చేశారు. శంకుస్థాపన సైతం చేశారు. కానీ పనులు మొదలు కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాధవపురి హిల్స్‌ నుంచి వస్తున్న మురుగునీరు ప్రధాన కూడలి వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌ నుంచి పొంగుతుంది. దీంతో అపర్ణ హిల్‌ పార్కు నుంచి వచ్చేరోడ్డు, అయ్యప్ప ఆలయం రోడ్డులో మురుగుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



రోడ్లపై పారుతున్న డ్రైనేజీ

మురుగునీటిలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి



పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌కు వెళ్ళే మార్గంలో నెలల తరబడి రోడ్డుపై మురుగు ఏరులై పారుతుంది. రోజు మురుగునీటిలో నుంచి నడిచి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం సమయాలలో వాహనాల రద్దీ, రోడ్డుపై మురుగుతో సమస్య వర్ణణాతీతం. – పవన్‌, స్థానికుడు

పైప్‌లైన్‌ పనులు మొదలుపెట్టాలి



అపర్ణ హిల్‌పార్కు, మాధవపురి హిల్స్‌, హెచ్‌ఎంటీ హిల్స్‌కు వెళ్ళాలంటే మురుగునీటి సమస్య ఎదుర్కొంటున్నాం. నూతన పైప్‌లైన్‌ కోసం శంకుస్థాపన చేసిన అధికారులు పనులు మొదలు పెట్టలేదు. వెంటనే మురుగునీటి పైప్‌లైన్‌ పనులు ప్రారంభించాలి.

– కమలాకర్‌శర్మ, వాహనదారుడు

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: వైట్‌ఫీల్డ్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ కిషోర్‌ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీదుబండ, సీఎంసీ లేఅవుట్‌, క్యామ్‌లెట్‌, వైట్‌ఫీల్డ్స్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొండాపూర్‌లో..

గచ్చిబౌలి: కొండాపూర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంత్‌నగర్‌, సఫారీనగర్‌, కొత్తగూడ, కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌ క్యాంపస్‌, పరిసరాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రంగారెడ్డి తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్‌: మదీనాగూడ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు మదీనాగూడ, కృషినగర్‌, ఎంఏనగర్‌, స్టాలిన్‌ నగర్‌, ప్రశాంత్‌నగర్‌, జనప్రియ వెస్ట్‌సిటీ, బీకే ఎన్‌క్లేవ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సురక్షా ఫీడర్‌ పరిధిలో.. విద్యానగర్‌, సురక్షా ఎన్‌క్లేవ్‌, సురక్షాహిల్స్‌, శుభోదయ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్‌, అపర్ణ హెచ్‌టీ సర్వీస్‌ ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు.
- భవానీపురం ఫీడర్‌ పరిధిలో.. భవానీపురం కాలనీ, వీకర్‌ సెక్షన్‌ కాలనీ, శంకర్‌నగర్‌ ఏరియాలలో ..
- పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో.. పీజేఆర్‌ రోడ్‌ నంబర్‌ 1,3,5,7,10,12, లగ్జరీ అపార్ట్‌మెంట్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

సంస్కృతం, ఆంగ్లభాషను నేర్చుకోవాలి



హెచ్‌సీయూలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో పాల్గొన్న అతిథులు

- విస్తృత పరిజ్ఞానంతో పరిశోధనల్లో మరింత ప్రామాణికత
- తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ భూమయ్య

రాయదుర్గం: పరిశోధనలో నూతన అంశాలను వివరించడానికి తెలుగుతో పాటు సంస్కృత, ఆంగ్లభాషలను నేర్చుకోవాలని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్‌ ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో స్కూల్‌ ఆఫ్‌ హ్యుమానిటీస్‌, తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన 'తెలుగు భాషా సాహిత్యాల పరిశోధన–పర్యావలోచన' అనే అంశంపై గురువారం రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా పరిశోధన అనేది విస్తృత అంశాల పరిజ్ఞానంతో మరింత పరిపుష్టం అవుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో తగినంత మంది అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సీనియర్‌ పాత్రికేయులు డాక్టర్‌ కె శ్రీనివాస్‌ మాట్లాడుతూ తమతమ సామాజిక, ప్రాంతీయ అస్తిత్వాలను అన్వేషించే దిశగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు .ప్రతి అంశంపై పూర్తి అవగాహన అవసరమని ఆయన సూచించారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం ఆచార్యులు అఫ్సర్‌ మాట్లాడుతూ అమెరికా, మరికొన్ని దేశాల్లో తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, గోనానాయక్‌, పమ్మి పవన్‌కుమార్‌, వారిజారిణి, త్రివేణి వంగరి, ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, బూదాటి వెంకటేశ్వర్లు, సి.ఖాసీం, డాక్టర్‌ లక్ష్మణ చక్రవర్తి, డాక్టర్‌.రజని, విజయ్‌కుమార్‌, వెల్దండి శ్రీధర్‌, సంగిశెట్టి శ్రీనివాస్‌లు పత్ర సమర్పణ చేశారు. ఈ సమావేశంలో భూక్యా తిరుపతి, డాక్టర్‌ భుజంగరెడ్డి, డాక్టర్‌ బాశెట్టి లత, విద్యార్థులు పాల్గొన్నారు.

2న డెర్మటాలజీ, ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్‌ ఆసుపత్రిలో మార్చి 2వ తేదీన డెర్మటాలజీ, ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సీఈఓ డాక్టర్‌ యోబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు నందు చెవి నొప్పి, వినికిడి, చెవి నుంచి ద్రవం విడుదల, తల తిరగటం, ముక్కు మూసుకుపోవటం, గొంతు నొప్పికి ఈఎన్‌టీ వైద్యులు లావణ్య ఆధ్వర్యంలో చికిత్స నిర్వహిస్తారు. అదే విధంగా మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర తదితరాలపై డాక్టర్‌ సి. స్వామి వైద్య పరీక్షలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. డాక్టర్‌ల సలహా మేరకు సీబీపీ ఏఈసీ, ఐజీఈ, ఎనిమియా ప్రొఫైల్‌, పీటీఏ, ఐఎంపీ, ఓఏఈ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వినికిడి పరికరాల మీద ప్రత్యేక డీఎం క్యాంప్‌ ఉంటుందని పేర్కొన్నారు.

16మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 14 మందికి రూ. వెయ్యి చొప్పున, ఇద్దరికి రూ. 1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

స్టార్టప్‌ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

టీహబ్‌–ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్‌, ఐఐఎం బెంగళూరు ఎంఓయూ



కార్యక్రమంలో సంస్థ సీఈఓ ఆనంద శ్రీగణేష్‌, టీహబ్‌ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్‌జాగిర్దార్‌ తదితరులు

రాయదుర్గం: భారతదేశంలో స్టార్టప్‌ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ ప్రాంగణంలో టీహబ్‌–ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్‌, ఐఐఎం బెంగళూరుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్‌ సీఈఓ ఆనంద శ్రీ గణేష్‌, ప్రోగ్రామ్‌ మేనేజర్లు విశాల్‌, కార్తీక్‌కుమార్‌ చౌదరి, టీహబ్‌ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌, అధికారులు పాల్గొన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లోని పర్యావరణ వ్యవస్థలలో మహిళల నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు గొప్ప అవకాశాలను అందించడానికి రెండు సంస్థలు సమిష్టిగా కృషి చేస్తాయి. కార్యక్రమంలో టీహబ్‌, ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్‌ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



మల్లన్నగుట్టపై అగ్నిగుండం



బీరంగూడ గుట్టపై శివపార్వతుల కల్యాణం

ఒగ్గుకథ, అగ్నిగుండం

రాయదుర్గం: మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం తెల్లవారుజామున మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గుకథతో అందరినీ అలరించారు. మల్లేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండంను పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

బీరంగూడలో..

పటాన్‌చెరు టౌన్‌: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానంలో, పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, చైతన్యనగర్‌ కాలనీలోని మహదేవుని ఆలయం, జే.పీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో గురువారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. ఆలయాలు కిటకిటలాడాయి.

పోచమ్మకు ప్రత్యేక పూజలు

మణికొండ: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు అనుబంధంగా మణికొండలోని సముద్రాల వాణిరమేష్‌ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. మణికొండ క్వార్టర్స్‌లోని పోచమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కందాట రాఘవరెడ్డి, దొడ్డి లక్ష్మణ్‌, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సందేహాలా..?



బంజారాహిల్స్‌: అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. ఏడాది క్రితం ప్రజాపాలన కింద దరఖాస్తులు స్వీకరించగా సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించారు. అయితే జాబితాలో పేర్లు లేని వారి కోసం మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నారు. అయితే సర్వే సమయంలో పలువురు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఏ విధంగా నమోదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమ దరఖాస్తు పరిస్థితి ఏమిటో సమాచారం తెలియక చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అటు జీహెచ్‌ఎంసీ, ఇటు తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ, ఇంకోవైపు కలెక్టర్‌ ప్రజావాణి, మరోవైపు ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే ప్రజావాణిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం దరఖాస్తు స్థితి తెలుసుకునేందుకు సర్వే నిర్వహణపై ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, హిమాయత్‌నగర్‌ డివిజన్లు, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్‌, వెంగళరావునగర్‌, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో సర్వే నిర్వహణపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సర్వేపై సందేహాలు ఉంటే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఈ అవకాశం కల్పించారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో రోజూ 150కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. వాటికి సమాధానం చెప్పేందుకు అధికారులు ఆన్‌లైన్‌లో జాబితాను రూపొందిస్తున్నారు.

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయొచ్చు..

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాల నమోదుపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఉంది. పేజీలో ఫిర్యాదులపై క్లిక్‌ చేసి మన మొబైల్‌ నంబర్‌ టైప్‌ చేయగానే ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్‌ చేయగానే ఫిర్యాదు పేజీ ఓపెన్‌

ప్రత్యేక వెబ్‌సైట్‌.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు అవకాశం.. రోజూ వందల్లో ఫిర్యాదులు

అవుతుంది.

- మన ఆధార్‌ నెంబర్‌ నమోదు చేయగానే పలు వ్యక్తిగత వివరాలు, చిరునామా నమోదవుతాయి.
- ఫిర్యాదుల కేటగిరి ఎంచుకోగానే కింద ఐచ్ఛికలు కనిపిస్తాయి.
- సర్వేయర్‌ సందర్శించలేదు, సంతృప్తి చెందలేదు, సర్వే సక్రమంగా జరగలేదు, సర్వే సమయంలో గైర్హాజర్‌ అయ్యారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేయలేదు, మధ్యవర్తితో సమస్యలు, డబ్బులు డిమాండ్‌ చేస్తున్న సర్వేయర్‌.. వీటిలో దరఖాస్తుదారుడు ఎదుర్కొన్న సమస్యను ఎంచుకుని ఫిర్యాదు వివరాలు రాయాల్సి ఉంటుంది.
- అనంతరం ఏదేని ధ్రువపత్రాన్ని అప్‌లోడ్‌ చేసి సబ్మిట్‌పై నొక్కాలి.
- వెంటనే మొబైల్‌ ఫోన్‌కు ఫిర్యాదు నంబర్‌ వస్తుంది. కొద్ది రోజుల తర్వాత ఫిర్యాదు వివరాలు తెలుసుకోవచ్చు.

దరఖాస్తు స్థితి ఇలా తెలుసుకోవచ్చు..

గూగుల్‌లో http:///indirammaindulu.telangana.gov.in వెబ్‌సైట్‌ను నమోదు చేయగానే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన పేజీ ఓపెన్‌ అవుతుంది.

అందులో అప్లికేషన్‌ సెర్చ్‌ను ఎంపిక చేసుకోవాలి. మొబైల్‌ నెంబర్‌, ఆధార్‌కార్డు, అప్లికేషన్‌ ఐడీ, రేషన్‌కార్డు అంశాల్లో ఏదో ఒక వివరాలు నమోదు చేయగానే మన అప్లికేషన్‌ వివరాలు ప్రత్యక్షమవుతాయి. దీంతో సర్వే స్థితి, ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌ : చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కొత్తకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులు పూర్తైన నేపథ్యంలో కార్పొరేటర్‌ జగదీశ్వర్‌గౌడ్‌, ఐటీ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, జెన్‌ పాక్‌, యునైటెడ్‌ వే హైదరాబాద్‌ ఐటీ కంపెనీతో పాటు సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచి నీటి వనరులు కాపాడుకోవాలన్నారు. మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టు పైప్‌లైన్‌ నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తామన్నారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐటీ సంస్థ ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.